నమస్తే తెలంగాణ
వరంగల్
హనుమకొండ
5 | గురువారం 8 ఫిబ్రవరి 2024 | WARANGAL HANUMAKONDA

## ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పెండింగ్ బిల్లులను చెల్లించాలి


కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ కవిత

మహబూబాబాద్, ఫిబ్రవరి 7: ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిర్మాణాల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి శైలేష్‌కుమార్‌కు మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత వినతిపత్రం అందించారు. బుధవారం ఢిల్లీలోని ఆయన నివాసంలో కలిసి ఉపాధి హామీ బిల్లులు చెల్లించేలా కృషి చేయాలని కోరారు. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద వైకుంఠధామాలు, రైతువేదికలు, గ్రామ పంచాయతీ బిల్డింగ్‌ల నిర్మాణాలు పూర్తి కాకుండానే పూర్తయినట్లు, అందుకు సంబంధించిన బిల్లులను సైతం చెల్లించినట్లు స్టేటస్‌లు ఉన్నాయని పేర్కొన్నారు. నిజానికి ఆయా నిర్మాణాలు పూర్తి కాలేదని, సంబంధిత బిల్లుల చెల్లింపులు జరుగలేదని వివరించారు. తిరిగి సదరు నిర్మాణాలకు బిల్లులు మంజూరు చేయాలని కోరారు. ఎంపీ వెంట జిల్లా సర్పంచుల ఫోరం మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ బోడ లక్ష్మణ్ నాయక్ ఉన్నారు.

## తగాదాలతో కాంగ్రెస్ నేతలు బజార్ల పడుతరు..

**- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**



జనగామ రూరల్, ఫిబ్రవరి 7: అధికార కాంగ్రెస్‌లో గ్రూపు తగాదాలున్నయి.. వాళ్లలో సమన్వయం లేక బజార్ల పడుతరు.. నాకు 40 ఏండ్ల రాజకీయ అనుభవం ఉంది. ఏడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన.. ప్రజలు మార్పు కోరుకోవడంతో ఓటమి చెందా. గతంలో ఎన్టీఆర్ కూడా ఇలాగే ఓడిపోయినా తర్వాత ప్రజలు గ్రహించి మళ్లీ అధికారంలోకి తీసుకొచ్చారు. ఓడించిన నాయకులను ప్రజలు మళ్లీ గెలిపిస్తరు. కాంగ్రెస్‌లో గ్రూపు తగాదాలతో వారే బయటపడుతరు. కృష్ణా జలాల కోసం గతంలో కేసీఆర్‌పై ఒత్తిడి తెస్తే అవకాశం ఇవ్వలె.. అదే కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే అవకాశం ఇచ్చింది. మన ప్రభుత్వం లేదని కార్యకర్తలు బాధపడొద్దు. ఆదుకోవడానికి అందరం ఉన్నం. అండగా ఉంటాం. జనగామ జిల్లాకు సాగునీరందించి కరువును తరిమేసినం.

## చార్‌సౌ బీస్ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్

**-స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**



చార్‌సౌ బీస్ హామీలతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వీటిలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప మరేది అమలు కాలె. డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించాడు. ఎక్కడ అమలైంది. రైతుబంధులో ఎకరాకు రూ.15 వేలు ఇస్తామన్నరు. ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని మోసం చేశారు. మహాలక్ష్మి పథకంలో మూడు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పారు. పేద మహిళలకు రూ.2500, వంటగ్యాస్ సిలిండర్‌ను రూ.500 ఇస్తామన్న హామీలు నేటికీ నెరవేరలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఇప్పటికే 60 రోజులు గడిచినయ్. కాలయాపన చేస్తున్నారు తప్ప అమలు దిశగా అడుగులు పడడం లేదు. వచ్చే నెలలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ వస్తుంది. ఎన్నికలయ్యాక అమలు చేస్తమని చెబుతరు. కాంగ్రెసోళ్లు వాళ్లలో వాళ్లే కొట్టుకోవడం ఖాయం. మళ్లీ బీఆర్‌ఎస్ జెండా ఎగరడం ఖాయం. తెలంగాణ బాగుకోసం కొట్లాడింది బీఆర్‌ఎస్ మాత్రమే. రాష్ట్ర అభివృద్ధికి, హక్కులు, సంక్షేమ పథకాల అమలుకు పార్లమెంట్‌లో గళం వినిపించడానికి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి. కాంగ్రెస్ ప్రభుత్వ గ్రాఫ్ పడిపోయింది. హామీలు అమలు చేయడం లేదని ప్రజల్లో చర్చ జరుగుతున్నది. సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యమ నేత కేసీఆర్‌పై వాడిన భాష ఆయన సంస్కారానికి అద్దం పడుతున్నది. సీఎం అని మరిచి ఓ పార్టీకి అధ్యక్షుడిననే భ్రమలో ఉండి మాట్లాడుతున్నాడు. రాష్ట్రంలో 70 లక్షల మంది రైతులకు రైతుబంధు రావాల్సి ఉండగా, ఇప్పటి వరకు ఎంతమంది రైతులకు పంట సాయం వచ్చిందో మంత్రి కోమటిరెడ్డి తెలుపాలి. అప్పుడు ఎవరిని చెప్పుతో కొట్టాలో రైతులే చూసుకుంటరు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేస్తాం. ఉమ్మడి జిల్లాలోని కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం.

## కేసీఆర్‌తోనే బీడు భూములు సస్యశ్యామలం..

**-మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి**



కరువు ప్రాంతమైన జనగామ జిల్లాకు గోదావరి జలాలు తీసుకురావడం కేసీఆర్‌కే సాధ్యమైంది. వ్యవసాయానికి ఉచిత విద్యుత్, ఎరువులు, విత్తనాలు, రైతుబంధు సాయం ఇవ్వడం బీఆర్‌ఎస్ పాలనలోనే సాధ్యమైంది. ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మళ్లీ రైతులకు కరెంట్ కోతలు తప్పడం లేదు.

## మాజీ సర్పంచ్‌లకు సన్మానం

ఈ సందర్భంగా మాజీ సర్పంచులను బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి, మాజీ మార్కెట్ చైర్మన్లు బాల్దె సిద్ధిలింగం, మల్లేశం, గాడిపల్లి ప్రేమలతారెడ్డి, బండ పద్మ, జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, ఎంపీపీలు మేకల కళింగరాజు, కృష్ణారెడ్డి, కరుణాకర్, జడ్పీటీసీలు సిద్ధప్ప, శ్రీనివాస్, దీపిక, బీఆర్‌ఎస్ నాయకులు పసుల ఏబెల్, జనగామ వీరేందర్ రెడ్డి, ఇర్రి రమణారెడ్డి, గద్దల నర్సింగరావు, బాల్దె విజయ, పెద్ది రాజిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, భిక్షపతి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు బైరగోని యాదగిరిగౌడ్, చంద్రారెడ్డి, నాయకులు చినబోయిన రేఖ, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షులు బొల్లం శారద, గంగం సతీశ్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షురాలు లక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్ రాంప్రసాద్, కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామశాఖల అధ్యక్షులు పాల్గొన్నారు.

### ఎంపీ ఓట్లెలా అడుగుతారు?

క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్, మహిళలకు గృహజ్యోతి పథకం కింద నెలకు రూ.2500, పింఛన్ రూ.4 వేలకు పెంచకుండా పార్లమెంట్ ఎన్నికల్లో మహిళలు, రైతుల ఓట్లు ఎట్లా అడుగుతారని హరీశ్‌రావు ప్రశ్నించారు. తెలంగాణ రాకముందు రాష్ట్రంలో 96 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండితే, ఇప్పుడు 3 కోట్ల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తున్నదన్నారు. ఇదంతా ఊరికే సాధ్యమైందా? కాళేశ్వరంపై తప్పుడు ప్రచారం చేస్తున్న నాయకులు కేసీఆర్ వల్లే ఇంత దిగుబడి పెరిగిందన్న సంగతి తెలియదా? అని అన్నారు. తెలంగాణలో 17 ఎంపీ సీట్లను గెలిపిస్తే రాహుల్‌గాంధీ ప్రధాని అయితేనే ఆరు గ్యారెంటీలు అమలవుతాయన్న సీఎం మాటలు విడ్డూరంగా ఉన్నాయని, కాంగ్రెస్ పార్టీ గెలిచేది లేదు, పథకాలు అమలయ్యేది లేదన్నారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బోడకుంటి, తదితరులు

- కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం
- కాంగ్రెస్ పార్టీ మోసాలపై గ్రామాల్లో చర్చ పెట్టాలి
- మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- జనగామ నియోజకవర్గ స్థాయి సమావేశంలో శ్రేణులకు పిలుపు
- హాజరైన మాజీ మంత్రి ఎర్రబెల్లి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం, మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

# భవిష్యత్ మనదే..

## బీఆర్‌ఎస్‌ది ప్రజల పక్షం

జనగామ, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ) : 'ఈ ఓటమి కేవలం స్పీడ్ బ్రేకర్ మాత్రమే..మనమంతా ఒక కుటుంబంలాగా పని చేద్దాం.. భవిష్యత్ మనదే..' అని బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పార్టీ శ్రేణులకు భరోసా ఇచ్చారు. బుధవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన పసరమడ్లలోని ఉషోదయ కన్వెన్షన్‌లో జరిగిన జనగామ నియోజకవర్గ స్థాయి బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి అతిథులుగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జనగామ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బోడకుంటి వెంకటేశ్వర్లు, జడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, ఎంపీపీలు, జడ్పీటీసీలు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన హరీశ్‌రావు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులను కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులతో ఇబ్బంది పెడుతున్నదన్నారు. 'అధికారులు, పోలీసు యంత్రాంగం నిష్పక్షపాతంగా పనిచేయండి.. మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ పార్టీనే.. ఇలాగే ఉంటే అప్పుడు మీ భరతం పడతాం..' అని హెచ్చరించారు. కేసీఆర్‌కి జనగామ అంటే ఎంతో గౌరవం, ప్రేమ, ఏ అంశం ప్రస్తావనకు వచ్చినా జనగామ, నర్మెట, బచ్చన్నపేట, చేర్యాల గురించే ఆయన ప్రస్తావిస్తారని గుర్తుచేశారు. జనగామ గడ్డ మీద హ్యాట్రిక్ విజయం అందించిన ప్రతి కార్యకర్తకు ధన్యవాదాలు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, మంచి రోజులు వస్తాయన్నారు. బీఆర్‌ఎస్‌కు ఉద్యమాలు, నిర్బంధాలు కొత్త కాదు, అధికారమైనా ప్రతిపక్షమైనా మనది ప్రజల పక్షం అని హరీశ్‌రావు అన్నారు. అనేక ఉద్యమాలు చేసిన గడ్డ జనగామ ప్రాంతం ఇవ్వాల కాంగ్రెస్ పార్టీ నేతలు నోరు పెద్దగా చేసుకొని మాట్లాడుతున్నారని, వాళ్ల మొఖానికి నీళ్లన్నా ఇచ్చిండ్రా, తుపాకులగూడెం వద్ద గోదావరిపై బ్యారేజీ కట్టి దేవాదుల ద్వారా సంవత్సరం మొత్తం నీళ్లు అందించిన ఘనత మనదని ఆయన స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు సహా మొత్తం 420 హామీలిచ్చి అమలు చేస్తమన్నరు.. ఇప్పుడు కొండనాలికకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్టు మాట్లాడుతున్నాడని హరీశ్‌రావు మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసాల గురించి గ్రామాల్లో చర్చ పెట్టాలని, రైతు బంధు ఇవ్వొద్దని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి ఆపించారని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చాక రైతుబంధు ఇవ్వడం లేదన్నారు. కరోనా కష్ట కాలంలో కూడా రైతుబంధు టంచన్‌గా ఇచ్చినం, ఇప్పుడు అడిగితే రైతులకు ఆపి ఉద్యోగులకు జీతాలు వేసినం అంటున్నారని, అటు జీతాలు రాలె.. ఇటు రైతు బంధు పడలేదన్నారు. కాంగ్రెస్ నాయకులకు వ్యంగ్యం తప్ప వ్యవహారం తెలవదని, ప్రగతిభవన్ కట్టిస్తే అందులో బంగారు బాత్రూంలు కట్టించుకున్నారని అబద్ధపు ప్రచారాలు చేశారని హరీశ్‌రావు విమర్శించారు. అసెంబ్లీ సాక్షిగా నిరుద్యోగ భృతి హామీ ఇవ్వలేదని అబద్ధాలు చెప్పారని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నాలుగు రకాల మోసాలు చేసిందన్నారు. రైతుబంధు, రుణమాఫీ, 24 గంటల ఉచిత కరెంటు, వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తామన్న హామీలు తప్పారని, ఇప్పుడు కరెంటు 14 గంటలు కూడా వస్తలేదన్నారు. ప్రమాణ స్వీకారం రెండు రోజుల ముందే చేస్తివి.. హామీలేమో ఆలస్యం చేయబడితివి, రూ. 500 బోనస్ ఇచ్చి వడ్లు కొంటేనే రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి రైతులు ఓటు వేస్తారని, మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2500 ఇస్తేనే మహిళలు ఆ పార్టీకి ఓట్లేస్తారని హరీశ్‌రావు అన్నారు. కర్ణాటకలో కూడా ఆరు గ్యారెంటీలు అమ లు చేస్తామని హామీ ఇచ్చి ఇన్ని నెలలైనా ఇస్తలేరని, అక్కడ ప్రజలు ధర్నాలు చేస్తున్నారని అన్నారు. రైతుబంధు అడిగితే చెప్పుతో కొడుతా అని మంత్రి అంటే సీఎం రేవంత్‌రెడ్డి మాటలు రాష్ట్రం పరువు తీసేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి దమ్ముంటే 40 ఎంపీ సీట్లు గెలవాలని, ఇండియా కూటమి నుంచి బయటకు వచ్చిన మమతా బెనర్జీ సవాల్ విసిరిందని, ఆ పార్టీ గెలిచేది లేదు, సచ్చేది లేదని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ మెడలు వంచాలంటే రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించి బుద్ధి చెప్పాలన్నారు. రాహుల్‌గాంధీ ప్రధాని అవ్వడం కాదు కదా .. ఆ పార్టీకి ప్రధాన ప్రతిపక్షం కూడా వచ్చే అవకాశం లేదని హరీశ్‌రావు పేర్కొన్నారు. కాళేశ్వరం మీద ఎన్నో అసత్యాలు చెబుతున్నారని, చిన్న సమస్య ఉంటే వెతికి పరిష్కరించి నీళ్లు అందించాలి తప్ప రాజకీయం చెయ్యొద్దని హితవు పలికారు. సోనియా పుట్టిన రోజున పదవీ స్వీకారం చేస్తా అన్న రేవంత్ ముందే చేశాడు.. కానీ ఇచ్చిన హామీలు నెరవేర్చే పనిలో మాత్రం ఆలస్యం చేస్తున్నాడని ఆయన మండి పడ్డారు.

### మార్పు అంటే ఇదే..

జనగామ బీఆర్‌ఎస్ సమావేశంలో మాట్లాడుతుండగానే పలుమార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. జనరేటర్ సాయంతో మైక్‌లో మాట్లాడిన మాజీ మంత్రి హరీశ్‌రావు మార్పు వచ్చింది కదా అంటూ ఛలోక్తి విసరడంతో సభలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు సీఎం డౌన్‌డౌన్, కాంగ్రెస్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు.


సమావేశంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు

### కాంగ్రెస్‌వి ఝూటాకోర్ మాటలు..

అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చి 60 రోజుల్లోనే రైతాంగానికి నాలుగు మోసాలు చేసిన భట్టేభాజ్ కాంగ్రెస్ పార్టీ మోసాలను, సీఎం రేవంత్‌రెడ్డి నిజ స్వరూపంపై ప్రజల్లో చర్చకు పెట్టాలని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన హామీలు, ప్రకటనలపై వీడియో క్లిప్‌లను సమావేశంలో స్క్రీన్లపై పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రదర్శించిన హరీశ్‌రావు ఝూటాకోర్ మాటలతో సీఎం రేవంత్‌రెడ్డి కాలం గడుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రియాంక సమక్షంలో రేవంత్‌రెడ్డి నిరుద్యోగ భృతి హామీ ఇస్తే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాత్రం అసెంబ్లీ సాక్షిగా హామీ ఇవ్వలేదని అబద్ధాలు చెప్పిన అంశాన్ని హరీశ్‌రావు వీడియో క్లిప్‌లో చూపించారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంకా 40 రోజుల గడువే మిగిలి ఉందన్నారు. మీకు చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్ ఎన్నికల కోడ్ కంటే ముందే జీవోలు విడుదల చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

### ప్రభుత్వంతో కొట్లాడైనా హామీలు నెరవేరుస్తా..



పార్లమెంట్ ఎన్నికల తర్వాత తాను ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వంతో కొట్లాడైనా నెరవేరుస్తానని, నా సొంత ఆస్పత్రిలో జనగామ నియోజకవర్గం ప్రజలకు ఉచిత వైద్యం అందిస్తున్న.. ఇది ఐదేళ్లు కొనసాగుతుందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. వచ్చే ఐదేళ్లలో ప్రభుత్వం నుంచి నాకు వచ్చే జీతం ప్రతి రూపాయి నియోజకవర్గ అభివృద్ధికి కేటాయిస్తానని చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైతే నా గెలుపు కోసం కృషి చేశారో.. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల్లోనూ అలాగే పని చేసి బీఆర్‌ఎస్‌ను గెలిపిద్దామన్నారు. జనగామ జిల్లాలో గత సంవత్సరం ఈ సమయానికి అన్ని చెరువుల్లో 80 శాతం నీళ్లు ఉండేవని, ఇప్పుడు 20 శాతం కూడా లేని ఫలితంగా యాసంగి సాగు తగ్గిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సరిగ్గా కరెంటు, నీళ్లు రావడం లేదని, అధికారులు గత ప్రభుత్వంలో లబ్ధిపొంది కూడా ఇప్పుడు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులను ఇబ్బంది పెడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు కూడా మా నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారని, ఒక్కటి గుర్తు పెట్టుకోండి మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ పార్టీనే. అప్పుడు మేమేంటో చూపిస్తాం అని పల్లా రాజేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు.

**-జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి**

# ఉల్లాసంగా.. ఉత్సాహంగా

- జేఎన్‌ఎస్‌లో రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు
- 33 జిల్లాల నుంచి 600 మంది క్రీడాకారుల హాజరు
- ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి


పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని, తలపడుతున్న క్రీడాకారులు



హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 7 : తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అండర్-15, అండర్-20 రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో బుధవారం జరిగిన ఈ పోటీలకు 33 జిల్లాల నుంచి 600 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పోటీలను ప్రారంభించి మాట్లాడుతూ.. జాతీయస్థాయి రెజ్లింగ్ క్రీడల్లో తెలంగాణ కీర్తి ప్రతిష్టలు ఇనుమడింపజేయాలన్నారు. తెలంగాణ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ.. క్రీడాకారులకు ఉచిత భోజన వసతితో పాటు ఎంట్రీ ఫీజు లేకుండా ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రధాన కార్యదర్శి మహ్మద్ కరీం మాట్లాడుతూ.. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను ఈ నెల 11 నుంచి మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయిలో భారత పతాకాన్ని సగర్వంగా ఎగురవేస్తున్న క్రీడ రెజ్లింగ్ అని, నగరంలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శాట్స్ పరిశీలకుడు, డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్ నాయక్, తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ వరద రాజేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సారంగపాణి, వరంగల్ జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కైలాసం యాదవ్, వివిధ జిల్లాల రెజ్లింగ్ సంఘాల బాధ్యులు రాజ్‌కుమార్, జైపాల్, షేక్ రియాజ్, కాసిం హుస్సేన్, సాయిలు, శ్రీనివాస్, రవి పాల్గొన్నారు.

# 14వేల మందితో బందోబస్తు

- మహాజాతరలో 475 సీసీ కెమెరాలతో నిఘా
- భక్తులు పోలీసు మార్గదర్శకాలను పాటించాలి
- ములుగు ఎస్పీ శబరీష్


మాట్లాడుతున్న ములుగు ఎస్పీ శబరీష్

దామెర, ఫిబ్రవరి7 : మేడారం మహాజాతరలో సుమారు 14000 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించనున్నట్లు ములుగు ఎస్పీ శబరీష్ తెలిపారు. బుధవారం హనుమకొండ జిల్లా దామెర మండలం దుర్గంపేటలోని ఎన్‌ఎస్‌ఆర్ హోటల్‌లో మేడారం జాతర -2024పై మీడియా ప్రతినిధులతో ముచ్చటించారు. జాతర విజయవంతంలో మీడియా మిత్రులు కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రజలకు జాతరలో పాటించాల్సిన జాగ్రత్తలు తెలియజేసే ఒకే ఒక మాధ్యమం మీడియా అని పేర్కొన్నారు. జాతరలో 1000 మంది మహిళా పోలీసులతో బందోబస్తుతో పాటు దొంగతనాలు జరుగకుండా 500 మంది సీసీఎస్ సిబ్బందితో చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. గత జాతరలలో పనిచేసిన అనుభవం ఉన్న అధికారులను ప్రస్తుతం బందోబస్తుకు ఉపయోగించుకుంటున్నామని వివరించారు. 475 సీసీ కెమెరాలతో నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశామని చెప్పారు. భక్తులు తమ వాహనాలను రహదారులపై ఆపవద్దని, గతంలో కన్నా 500 ఎకరాల స్థలాన్ని పార్కింగ్‌కు కేటాయించామని పేర్కొన్నారు. ప్రజలు సరైన విధంగా పోలీసు వారి మార్గదర్శకాలను పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని సూచించారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో వనదేవతలను దర్శించుకునేలా అన్ని చర్యలను పోలీస్ శాఖ తరపున తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీపీఆర్‌ఓ లక్ష్మణ్ రావు, దుగ్గొండి సీఐ కిషన్ (మేడారం జాతర మీడియా లైజనింగ్ ఆఫీసర్), స్పెషల్ బ్రాంచ్ సీఐ కిరణ్ పాల్గొన్నారు.

# ఘనంగా గుడిమెలిగే పండుగ

- ఆచార వ్యవహారాలతో ప్రత్యేక పూజలు
- ఆలయాలను శుద్ధి చేసిన పూజారులు
- నేటి నుంచి అమ్మవార్లకు పూజలు


గుడిలో అలుకు పూసి, ముగ్గులు వేస్తున్న మహిళా పూజారులు


సమ్మక్క గుడిపైన వట్టి గడ్డి వేస్తున్న పూజారి

తాడ్వాయి, ఫిబ్రవరి 7 : మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరకు అడుగుపడింది. సమ్మక్క-సారలమ్మ పూజారులు జాతర నిర్వహణపై ఆరు నెలల క్రితం నిశ్చయించగా బుధవారం గుడిమెలిగే పండుగతో అమ్మవార్లకు పూజలు ప్రారంభమయ్యాయి. మేడారంలోని సమ్మక్క పూజామందిరంలో, కన్నెపల్లిలోని సారలమ్మ దేవాలయంలో సిద్దబోయిన, కాక వంశీయులు ప్రత్యేక పూజలు ఆరంభించారు. వేకువజామున నిద్రలేచి మొదట ఇళ్లను శుద్ధి చేసుకున్న తర్వాత నూతన వస్త్రాలు ధరించి ఆయా గ్రామాల్లో పూజారులు, వంశీయులు ఆలయాలకు చేరుకున్నారు. తొలుత మందిరాలను, ఆ తర్వాత తల్లుల ప్రతిరూపాలైన గద్దెలను నీటితో శుద్ధి చేసి శుభ్రం చేశారు. పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు ఆధ్వర్యంలో డోలివాయిద్యాల నడుమ సమీప అటవీ ప్రాంతంలోకి వెళ్లి గుట్ట గడ్డిని సేకరించుకుని తల్లుల గద్దెల వద్ద భద్రపరిచారు. సమ్మక్క ప్రధాన పూజారి సిద్దబోయిన మునీందర్ ఇంటి నుంచి మామిడి తోరణాలు, పసుపు, కుంకుమ, పూజా సామగ్రిని తీసుకొని డోలివాయిద్యాల నడుమ ఆలయాలకు చేరుకున్నారు. గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి గద్దెల వద్దకు పూజాసామగ్రిని చేర్చి సేకరించిన గుట్ట గడ్డిని మందిరాలపై వేశారు. పూజారుల ఆడపడుచులు తల్లి గద్దెకు మట్టితో అలుకు పూతలు చేసిన తర్వాత రంగులతో గద్దెను అందంగా అలంకరించారు. సమ్మక్క ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్య ఆధ్వర్యంలో గత జాతర పూర్తయిన తర్వాత భద్రపరిచిన తల్లి పూజా సామగ్రిని బయటకు తీసి శుద్ధి చేశారు. ఈ సందర్భంగా పూజారులు, వారి కుటుంబ సభ్యులు, బంధువులు తల్లి గద్దెకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తల్లికి యాటపోతును సమర్పించి మహాజాతర ప్రారంభానికి తొలి పూజలు ఘనంగా నిర్వహించారు. కన్నెపల్లిలోని సారలమ్మ పూజామందిరంలో ప్రధాన పూజారి కాక సారయ్య, కిరణ్ అమ్మవారి పూజాసామగ్రిని శుద్ధి చేసి తల్లి రూపంలో ఉన్న అడేరాలను శుద్ధి చేసి పసుపు, కుంకుమ చల్లి పూజలు నిర్వహించారు. గుడిమెలిగే పండుగతో అమ్మవార్లకు మొదలైన పూజలు మహాజాతర తర్వాత వచ్చే తిరుగువారం వరకు ప్రతి రోజూ కొనసాగుతాయి. వచ్చే బుధవారం సమ్మక్క-సారలమ్మల మందిరాల్లో మండమెలిగే పండుగను ఘనంగా నిర్వహించి మళ్లీ వచ్చే బుధవారం అమ్మవార్ల మహాజాతర నిర్వహిస్తారు.

### మేడారం.. జన సందోహం

కోరిన కోర్కెలు తీర్చే సమ్మక్క-సారక్కల దర్శనం కోసం వచ్చే భక్తులతో మేడారం జనసందోహంగా మారింది. అమ్మవార్ల మహాజాతరకు మరికొద్ది రోజుల సమయం ఉన్నప్పటికీ ముందస్తుగా దర్శించుకునే భక్తుల సంఖ్యరోజురోజుకూ పెరిగిపోతోంది. బుధవారం సుమారు 6లక్షల మంది భక్తులను దర్శించుకున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు వెల్లడించారు. జంపన్నవాగులో పుణ్య స్నానాలు ఆచరించిన అనంతరం సమ్మక్క-సారక్క, గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దెల వద్దకు చేరుకొంటున్నారు. అనంతరం గిరిజన సంప్రదాయ పద్ధతుల్లో మొక్కులు చెల్లించుకుంటున్నారు. జాతర పరిసరాల్లో ఎటూ నాలుగు కిలోమీటర్ల మేర భక్తులు చెట్ల కింద విడిది చేస్తున్నారు. వంటలు చేసుకుని విందు భోజనాల అనంతరం స్వగ్రామాలకు తిరుగు ప్రయాణం అవుతున్నారు. భక్తుల వాహనాలతో పలు ప్రాంతాలు రద్దీగా మారాయి. జాతర పరిసరాల్లోని పలు రకాల దుకాణాల్లో వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి.


భక్తులతో కిటకిటలాడుతున్న మేడారం

# పట్టుకున్న రేషన్ బియ్యం ఏమైనట్లు?

**రాత్రికి రాత్రే మాయం**

జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి7(నమస్తే తెలంగాణ): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం నుండి అక్రమంగా తరలుతున్న రేషన్ బియ్యాన్ని మంగళవారం అర్ధరాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అయితే రాత్రికి రాత్రే బియ్యం మాయం కావడం చర్చనీయాంశంగా మారింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. రేగొండ మండలానికి చెందిన ఓ బియ్యం వ్యాపారి డీసీఎం వాహనంలో రేషన్ బియ్యాన్ని ఛత్తీస్‌గఢ్‌కు అక్రమంగా తరలించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో కొంత మంది యువకులు కారులో డీసీఎం వాహనాన్ని వెంబడించి భూపాలపల్లి పట్టణంలో అడ్డుకున్నారు. అప్పుడే అక్కడికి చేరుకున్న పోలీసులు డీసీఎం వాహనాన్ని అడ్డుకున్న వ్యక్తులను చితకబాది వారి సెల్‌ఫోన్లు లాక్కున్నట్లు సమాచారం. అనంతరం పోలీసులు బియ్యంతో ఉన్న డీసీఎం వాహనాన్ని వదిలేసినట్లు తెలిసింది. అయితే ఆ బియ్యం వ్యాపారి ఎవరు?, ఎవరి పైరవీతో బియ్యం వాహనాన్ని పోలీసులు వదిలేశారనే విషయం భూపాలపల్లిలో హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవలే బాంబులగడ్డ వద్ద ఒక ఇంట్లో నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసిన పోలీసులు ఇప్పుడు పట్టుబడిన బియ్యం వాహనాన్ని ఎందుకు వదిలేశారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై డీఎస్పీ రాములును వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదని, విచారణ జరుపుతానని అన్నారు.